క్లుప్తంగా

గురుపౌర్ణమికి ఆలయాల ముస్తాబు


టూ టౌన్ వద్ద ఆలయంలో సాయిబాబా వారు

బోట్‌క్లబ్: కాకినాడలో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించేందుకు బాబా ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం నుంచే బాబావారికి పంచామృతాభిషేకాలు నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక పేర్రాజుపేట సాయిబాబా ఆలయంలో భారీ అన్నదానం నిర్వహించనున్నారు. ఉదయం బాబావారికి అభిషేకాలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకుడు రాంగోపాల్ తెలిపారు. స్థానిక అశోక్‌నగర్, మాధవనగర్, భాస్కర్‌నగర్, టూటౌన్ తదితర ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు.

నేడు ఇండియన్ క్రిస్టియన్ డే

కరప: నడకుదురులోని యెరూషలేం మందిరంలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు తెలిపారు. కరపలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వేడుకలకు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు హాజరవుతారని, మండలంలోని పాస్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జె.పాల్ ప్రసాద్, సెక్రటరీ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, కన్వీనర్ పి.సత్యప్రసాద్, కె.ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హోమియో పితామహుడికి నివాళులు


హనీమన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: హోమియో పితామహుడు శామ్యూల్ హనీమన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. సర్పవరం జంక్షన్‌లో జరిగిన హనీమన్ వర్ధంతి సభలో న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ ఏ రకమైన అనారోగ్యాన్నినా నివారించే సురక్షిత వైద్య విధానం హోమియోపతి అన్నారు. మొక్కలు, ఖనిజాలు వంటి సహజ పదార్థాలతో హోమియోపతి మందులు తయారు చేస్తారని, నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎందరో ఈ విధానాన్ని ఆదరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధిలో కృషి అభినందనీయం

కాకినాడ రూరల్: ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల క్రీడల అభివృద్ధికి, క్రీడా సంస్కృతిని బలోపేతం చేయడంలో పాత్రికేయుల కృషి అభినందనీయమని రాష్ట్ర టెన్నికాయిట్ అధ్యక్షుడు వైడీ రామారావు అన్నారు. ప్రపంచ క్రీడా పాత్రికేయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు క్రీడా పాత్రికేయులను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా వైడీ రామారావు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలని అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, అడ్డాల సత్యనారాయణ, సువర్ణరాజు, వెంకటరమణ, రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ కార్యదర్శికి సత్కారం


రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కార్యదర్శి వద్దాది ఆదిత్యను సత్కరిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ కార్యదర్శి వద్దాది ఆదిత్య రోటరీలో ప్రతిష్టాత్మక ఉత్తమ కార్యదర్శి ప్లాటినం అవార్డు అందుకున్నారు. ఇటీవల విజయనగరంలో క్లబ్ గవర్నర్ భాస్కర్‌రామ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆదిత్యను ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడానికి సహకరించిన మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, క్లబ్ అధ్యక్షుడు కృష్ణప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన 12 నెలలలో చేసిన సేవలను ఆయన వివరించారు.

టీడీపీ ప్రచారం

కరప: నడకుదురులో ఆదివారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారంటీ, వస్తున్నా మీ గ్రామానికి మీఅనంతలక్ష్మి కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి పాల్గొన్నారు.

ఉన్నది లేనట్టు.. ఆపై కనికట్టు

- పట్టా ఉన్నా లేదంటూ బుకాయింపు
- వంతపాడి హడావుడి చేసిన పచ్చమీడియా
- తెర వెనుక కథ నడిపిన ప్రతిపక్షాలు


మణిమాల పేరుతో మంజూరైన ఇంటి పట్టా

కాకినాడ: ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు అభూతకల్పనతో తప్పుడు సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్న పచ్చ మీడియా మరోసారి తన నైజాన్ని చాటుకుంది. ఇళ్ల స్థలం రాలేదని గడప గడపకూ మన ప్రభుత్వంలో ఓ మహిళ కాకినాడ ఎమ్మెల్యేను నిలదీసిందంటూ ఓ కథనాన్ని వండి వార్చేసింది. వాస్తవాలను ఏ మాత్రం పరిశీలించకుండా సదరు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృత ప్రచారం చేసేసి చివరకు అది అంతా బూటకమని తేలాక ఇప్పుడు తలదించుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ 6వ డివిజన్ రేచర్లపేటలో నివసిస్తున్న పచ్చిపాల మణిమాల బెహరాన్‌లో ఉద్యోగం చేసుకుంటుంది. అప్పుడప్పుడూ ఇక్కడకు వచ్చి వెళ్తూ ఉంటోంది. ప్రభుత్వం నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో కొమరగిరి లేఅవుట్‌లో ఓ ఇళ్ల స్థలాన్ని ఆమెకు మంజూరు చేసింది. ఆమె కుమార్తెకు అమ్మ ఒడి ద్వారా వచ్చిన పథకం సొమ్మును కూడా తీసుకుంది. ఇలా లబ్ధి పొందిన ఆమె రెండు రోజుల కిందట ఆరో డివిజన్‌కు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వెళ్లిన సమయంలో తనకు ఇళ్ల పట్టా ఇవ్వలేదంటూ హడావుడి చేసింది. ఓ వైపు ఆమె తన నోటికి గట్టిగా పనిచెప్పడం, అదే సమయంలో కొందరు ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తులు అక్కడే ఉండి అదంతా రికార్డు చేయడం చకచకా జరిగిపోయింది. క్షణాల వ్యవధిలోనే ఆ వీడియోను సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేశారు. గడప గడపలో ప్రభుత్వానికి నిరసన సెగ తగిలిందంటూ కథనాన్ని విస్తృత ప్రచారం చేసేసి తమ నైజాన్ని చాటుకున్నారు. తీరా వాస్తవాన్ని పరిశీలిస్తే కొమరగిరిలో ఆమెకు స్థలం మంజూరు చేసినట్టు తేలింది. పట్టాను కూడా ఆమె తీసుకుందని అధికారులు చెబుతున్నారు.

సమస్య ఇదీ...

ఇళ్ల పట్టా తీసుకున్న సదరు మణిమాలకు నిబంధనల అనుగుణంగా కేవైసీ చేయించాల్సి ఉంటుంది. ఆమె బెహరాన్‌లో ఉండడంతో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. మరోవైపు మంజూరైన స్థలం లేఅవుట్ అయ్యి, జియో ట్యాగింగ్ చేశాక ఇంటి నిర్మాణం చేయాలి. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షల రాయితీ కోసం ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాను కూడా తెరిచారు. అన్నీ సక్రమంగా జరుగుతున్న సమయంలో ఆమె ఇంటి వద్దకు వచ్చిన నేతల ముందు కేకలతో ఆక్రోశాన్ని వెళ్లగక్కడం, దానిని చిత్రీకరించి పచ్చమీడియా విస్తృత ప్రచారం చేయడం వెనుక పెద్ద డ్రామానే నడిచిందంటున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వానికి వస్తోన్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలా.. డ్రామా ఆడించి దానిని విస్తృతంగా ప్రచారం చేసి మరోసారి అబాసు కావాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న అతిని చూసి జనం నివ్వెర పోతున్నారు.

సన్‌డే... మండే


కరపలో జనసంచారం లేని ప్రధాన రోడ్డు


కరప నుంచి కాకినాడ వెళ్లే రహదారి ఇలా..

కరప: భానుడు నిప్పులు కురిపించాడు.. తన ప్రతాపంతో భగభగలు సృష్టించాడు.. ఆదివారం మండలంలో ఎండకు జనం హడలెత్తిపోయారు. రోహిణి, మృగశిర కార్తెల తర్వాత కాస్త చల్లబడుతుందనుకుంటే తిరిగి ఎండలు ముదిరిపోతున్నాయి. ఆరుద్ర కార్తెలో నైరుతి రుతుపవనాలు వస్తాయనుకుంటే అవికాస్త మొండికేయడంతో ఎండలు ఉగ్రరూపం దాల్చాయి. ఆషాఢంలో వర్షపు జల్లులు పడతాయనుకుంటే నిరాశే ఎదురవుతోంది. ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. ఆదివారం పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదు కావడంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. ఆరు రోజుల కిందట ఆకాశంలో మబ్బులుపట్టి వర్షం పడటంతో వేసవితాపం నుంచి ఉపశమనం పొందారు. ఒకపక్క కాలువలకు నీరొదిలారని, నైరుతి రుతుపవనాలు కూడా వచ్చేశాయని ప్రజలు సంతోష పడ్డారు. మళ్లీ ఒక్కసారిగా ఎండల తీవ్రత పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరప మండలంలోని ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉంటోంది. సాయంత్రం ఏడు గంటల వరకూ వడగాడ్పులు వీచాయి. ఎండ తీవ్రతకు సార్వా నారుమళ్లు దెబ్బ తింటున్నాయని రైతులు అంటున్నారు. వర్షాల కోసం రైతన్న ఆశగా ఎదురు చూస్తున్నాడు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


బొప్పరాజుకు వినతి పత్రం అందజేస్తున్న మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్

కాకినాడ సిటీ: వైద్య ఆరోగ్య శాఖలో మల్టీపర్పస్ ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఆదివారం కాకినాడలో రెవెన్యూ భవన్‌లో రాష్ట్ర జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లును వారు కలసి వినతి పత్రం అందజేశారు. తమకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని, వీలులేని పక్షంలో రెండు మూడు సచివాలయాలకు ఒక సూపర్‌వైజర్ క్యాడర్‌ను కల్పించాలని కోరారు. డిప్యూటేషన్ తీసివేసి తిరిగి తమ ప్రాంతాలకు పంపించాలని బొప్పరాజును కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షురాలు కె.శశీల్యమ్మ, యు.ప్రమీల, పి.ఆదిలక్ష్మి, సీహెచ్ సుబ్బలక్ష్మి, యు.వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఐకమత్యంతో ప్రత్యేక స్థానం


శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో ఐక్యతను చాటుతున్న నాయకులు

కాకినాడ సిటీ: జిల్లాలో శెట్టిబలిజ సామాజిక వర్గీయులంతా ఐక్యంగా ఉండి, రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సాధించేందుకు కృషి చేయాలని జిల్లా శెట్టిబలిజ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా శెట్టిబలిజ సంఘ భవనంలో ఆ సంఘీయుల జిల్లా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా శెట్టిబలిజ సంఘం ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది నులుకుర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తులంతా ఒకేతాటిపైకి వచ్చి సంఘం ఐక్యతను చాటడం ద్వారా రాజకీయ పార్టీలకు కనువిప్పు కలుగజేయాలన్నారు. ప్రతి పార్టీ జిల్లాలో రెండు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముందుగా శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వర్లు, చొల్లంగి వేణుగోపాల్, వాసంశెట్టి రాజేశ్వరరావు, గీసాల శ్రీను, పెంకే శ్రీనివాసబాబా, రాయుడు నాగేశ్వరరావు, నురుకుర్తి రామకృష్ణ, అనుసూరి ప్రభాకరరావు, పితాని శ్రీనివాసరావు, పితాని అన్నవరం తదితరులు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు.

రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ అధ్యక్షుడిగా రవికృష్ణ


రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన రవికృష్ణను సత్కరిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడిగా నరహరిశెట్టి రవికృష్ణ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రోటరీ హాల్‌లో ఆదివారం క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులతో క్లబ్ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మహిళలు కూడా సేవా రంగంలో ముందుంటున్నారన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రవికృష్ణ మాట్లాడుతూ సీఎస్ఆర్ ఫండ్స్ సేకరించి ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. నూతన సభ్యులను రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ట్రెజరర్ కర్రి వీర్రెడ్డి అభినందించారు. అనంతరం నూతన అధ్యక్షుడిని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్, సభ్యులు చిరంజీవిరెడ్డి, ధనసాగర్ ప్రసాద్, టీవీ బాలకృష్ణ పాల్గొన్నారు.

సేవ చేసి.. ఉదారత చాటి


సహాయం అందజేస్తున్న సృజన హాస్పిటల్ అధినేత సత్యవతి తదితరులు

బాలాజీచెరువు: రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా ఆరేళ్లలో రూ.80 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ తెలిపారు. స్థానిక దేవాలయం వీధిలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం రూ.2 లక్షల విలువైన స్కాలర్‌షిప్, వినికిడి యంత్రాలను సృజన హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎ.సత్యవతి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా కలసి సామాజిక సేవలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ సీమకుర్తి పాపారావు, కల్యాణి, అరుణ్‌కుమార్, వాడకట్టు సురేష్, రామచరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కాకినాడ రూరల్: భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డును కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రేపూరు గ్రామంలో ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం గంటా భేతాకుడు, చవ్వాకుల రాఘవ, బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి 1996లో అనేక పోరాటాలతో బోర్డు ఏర్పాటైందన్నారు. మన రాష్ట్రంలో 2009లో ఏర్పాటు చేశారని, 2014 వరకూ అనేక సంక్షేమ పథకాలను కార్మికులు పొందారన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో తలటం సత్తిబాబు, నక్క శ్రీను, చవ్వాకుల వీరబాలేశ్వరరావు, దుగ్గన సుబ్రహ్మణ్యం, కోన తాతాజీ, మేడిశెట్టి శ్రీధర్, అడపా వీరభద్రరావు, బంగారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇలా.. వెళ్లేదెలా!


ఐడియల్ కళాశాల రోడ్డులో ప్రమాదకరంగా మారిన గొయ్యి

బోట్‌క్లబ్: స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులో వాటర్ ట్యాంకు ఎదురుగా వారం రోజుల కిందట మున్సిపల్ పైపులైన్ మరమ్మతుల నిమిత్తం గొయ్యి తీసి వదిలేశారు. ఇటుగా వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు తాగునీరు వృథాగా పోతున్నా కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. గొయ్యి తీసి వదిలేయడంతో రాత్రి సమయాల్లో విషయం తెలియని కొందరు ఇక్కడ వాహనాలపై వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

సందడిగా సాగర తీరం


తీర ప్రాంతంలో పర్యాటకుల సందడి

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. సెలవు దినం, వేసవి తాపం ఇంకా తగ్గకపోవడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు సాగర తీరానికి చేరుకుని ఉపశమనం పొందారు. తీరంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు తీర ప్రాంతంలో పర్యటించి యువత సముద్రపు కెరటాల వైపుకి వెళ్లొద్దని హెచ్చరించారు. తుని లోవలోకి వెళ్లిన భక్తులు సైతం తీర ప్రాంతంలో ఆగి సేద తీరారు.

వాసవీ క్లబ్ సేవలు విస్తృతం

సామర్లకోట: వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆ క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ చీమకుర్తి కృష్ణకిశోర్ అన్నారు. స్థానిక వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఏర్పాటు చేసిన డానేటు డెస్క్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగల్లో పేదలను గుర్తించి వారిని ఆదుకుంటామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా రైతు బంధులో ఒక రైతుకు పార, కొడవలి, క్రిమి సంహారక మందులు, విత్తనాలు, ఎరువులు అందజేశారు. రక్షణ మిత్రలో ఒక జవానును సత్కరించారు. ఆర్య వైశ్య నేస్తంలో ఒక నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు ఇచ్చారు. 10 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రజాహితం కార్యక్రమంలో భాగంగా బళ్ల మార్కెట్ సెంటర్, పిఠాపురం రోడ్డు, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు కటకం పద్మరత్నం అధ్యక్షత వహించగా అంతర్జాతీయ క్లబ్ సభ్యుడు వంకదర ఉదయ్‌కుమార్, రీజినల్ చైర్మన్ కేదారిశెట్టి సురేష్, రీజినల్ కార్యదర్శి గ్రంధి సూరిబాబు, జోన్ చైర్మన్ కడించెర్ల భాను, పీఆర్వో కటకం హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్విమ్మింగ్ జట్టు ఎంపిక


రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పెద్దాపురం: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి స్విమ్మింగ్ జట్టు ఎంపికలు జరిగాయి. కాకినాడ జిల్లా అమెచ్యూర్ అక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా స్విమ్మింగ్ జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సతీష్, పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఈ జట్టు 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగే రాష్ట్ర జూనియర్, సబ్ జూనియర్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. మూడు విభాగాల్లో స్విమ్మింగ్ పోటీల జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో బిక్కిన సాయి, రాజు, వెంకట శివరామకృష్ణ, కోచ్‌లు వీరభద్రం, ఎస్‌కే రాజా, వీరబాబు, నాని తదితరులు పాల్గొన్నారు. గ్రూపు–1 జట్టులో క్రీడాకారులు పీఎస్ రఘునందన్‌గౌడ్, క్రితిక్ అన్విష్, సాయి సుమంత్, సుశాంత్, కేఎస్ లయ చౌదరి ఉన్నారు. గ్రూప్–2లో అన్సరాయ్, ముఖేష్, మణికంఠ నవీన్, అఖిల్, అర్జున్, ఆహిల్, సాయి సుకేత్, జాన్, శ్రీసాయి, ఓజస్వీదేవి, సింధుజీ, జ్యోతిక, గ్రూపు–3 జట్టులో కె.దర్శిల్, కౌషిక్‌వర్ధన్, రామ్, నిషాంత, అభిషయ్, ఇనోష్, జీబీఎల్ వైష్ణవి, హిమద్యుతి, తన్వీ ఎంపికయ్యారు.

స్వైర విహారం..

- కాకినాడ జీజీహెచ్‌లో పశువుల సంచారం
- భయాందోళనలో రోగులు, సహాయకులు


కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ వార్డు ఎదురుగా తిష్ట వేసిన ఆవులు

కాకినాడ క్రైం: ఆరోగ్య ప్రదాయిని అది.. నిత్యం వేలాది మంది రోగులకు సేవలు అందించే ప్రాంతమిది.. అలాంటి కాకినాడ జీజీహెచ్‌లో పశువుల సంచారం అధికమైంది. రోగులకు యాతన వచ్చి పడింది. సాయంత్రం అయితే వాటి ఉనికి మరింత ఎక్కువవుతోంది. వీటి నిరోధానికి యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకోక పశువుల స్వైర విహారానికి అడ్డుకట్ట లేకుండా పోయింది. జీజీహెచ్‌లో రోగులు, వారి బంధువులు సంచరించే ప్రదేశాల్లో ఇవి సేద తీరుతున్నాయి. ఇవి ఏ సందర్భంలోనైనా తిరగబడొచ్చన్న వేదన అధికమవుతోంది. వాహనాల పార్కింగ్ స్థలాల్లోనూ తిష్ట వేస్తున్నాయి. వాటిని కదపడం ఎవరివల్లా కావడం లేదు. ప్రమాదకర వ్యర్థాలు నిర్వహించే డంప్ యార్డుల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. డస్ట్ బిన్‌ల నుంచి వ్యర్థాలు నోటితో లాగి చెల్లాచెదురు చేస్తున్నాయి. వార్డుల ఆవరణల్లో తిష్టవేసి లోపలి రోగులను బయటకు, బయట రోగులు లోపలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. గంభీరంగా అరుస్తూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల సర్జికల్ బ్లాక్ వద్ద ఓ ఆవు చేసిన వీరంగం అంతా ఇంతా కాదు. 70 ఏళ్ల రోగి బంధువు వెంట గంభీరంగా పడటంతో ప్రాణం పోయినంత పనైంది. అక్కడున్న తోటి రోగుల బంధువులు ఆ వృద్ధురాలిని రక్షించారు.

కుక్కలు... ఆవులే అధికం

ఆసుపత్రిలో సంచరిస్తున్న జంతువుల్లో కుక్కలు, ఆవులు అధికంగా ఉంటున్నాయి. పదుల సంఖ్యలో ప్రతి రోజు ఆసుపత్రిలో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. అదుపు తప్పిన గోవులు, ఎద్దులను నిలువరించడం సాధ్యం కావడం లేదు. కుక్కల్లో కొన్ని విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ రోగులకు హాని చేస్తాయేమోనన్న భయం కలిగిస్తున్నాయి. నేరుగా కొన్ని వార్డులలో లోపలకు కూడా కుక్కలు ప్రవేశిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిపై నర్సులు నేరుగా ఫిర్యాదు చేస్తున్నా యాజమాన్యం నుంచి స్పందన లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రిల్ పాత్‌లతో మేలు

జీజీహెచ్‌లో ప్రవేశానికి ఏడు మార్గాలు ఉన్నాయి. ఇందులో రెండు చోట్ల మాత్రమే పశువులు లోపలకు ప్రవేశించకుండా గ్రిల్ మార్గాలు ఏర్పాటు చేశారు. మిగిలిన ఐదు దారులు సాధారణమైనవి. వాటిని గ్రిల్ పాత్‌లుగా మార్చితే పశువులు ఆసుపత్రిలోకి ప్రవేశించే ఆస్కారం తక్కువగా ఉంటుంది. ఆ దిశగా ఆలోచన చేయాలని రోగులు ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరుతున్నారు.

నిరోధానికి చర్యలు

ఆసుపత్రిలో పశువుల సంచారం గతం కంటే తగ్గింది. ఉన్నవాటి నిరోధానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాం. గ్రిల్ పాత్‌ల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తాం. భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తాం. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే లోపు తాత్కాలిక పరిష్కారాలు చూపుతాం. సాయంత్రం వేళ కట్టుదిట్టమైన చర్యలకు తగిన ఆదేశాలిస్తాం.

– డాక్టర్ హేమలతాదేవి, సూపరింటెండెంట్, జీజీహెచ్